క్లుప్తంగా

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏపీఎం కూర్మారావు

హిరమండలం: స్త్రీ నిధి రుణాలు మహిళా సంఘాలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు సూచించారు. గురువారం మండలంలోని కల్లట గ్రామంలోని మహిళా సంఘాల పనితీరు, పుస్తక నిర్వహణను పరిశీలించారు. సభ్యులు అవసరం మేరకు మొదటగా పొదుపు నుంచి అప్పులు ఇచ్చి వసూలు చేసుకోవాలన్నారు. క్లస్టర్ కో ఆర్డినేటర్ అప్పల స్వామి, సంఘ వీఓఏ మోహన్ ఉన్నారు.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

పొందూరు: స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో వావిలపల్లిపేట మోడల్ స్కూల్లో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎస్ఐ వి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ప్రభాకర్ పర్యవేక్షించారు.

ఇసుక ర్యాంపు ప్రారంభం



నివగాంలో ఇసుక ర్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు: ప్రభుత్వం మంజూరు చేసిన తాత్కాలిక ఇసుక ర్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. మండలంలోని నివగాం, ఆకులతంపర గ్రామాల వద్ద వంశధార నదిలో రెండు ఇసుక ర్యాంపులను గురువారం ప్రారంభించారు. ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్డీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ రవిచంద్ర, మైనింగ్, రెవెన్యూ, పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్మశానానికి రహదారి ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సిర్ల ప్రసాదరావు

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామానికి చెందిన దళిత కుటుంబాలకు చెందిన శ్మశాన వాటికకు రోడ్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పారాపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం పలువురు దళిత నాయకులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రసాదరావుతోపాటు పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ.. పొలాల మధ్య శ్మశానం ఉన్నందున వర్షాకాలంలో పంట పొలాల మధ్య నుంచి మృతదేహాలను దహన సంస్కరణలు తీసుకువెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. దశబ్దాల కాలం నుంచి ఉన్న రోడ్డు సమస్యను అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయకపోతే ఆందోళన చేస్తామన్నారు. దళిత నాయకులు కె.సింహాచలం, జి.రామారావు, కొర్ర రవి, యందవ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కషాయాల తయారీపై అవగాహన



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న సూర్యనారాయణ

హిరమండలం: కషాయాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ఎంఎల్‌పురం గ్రామంలో గ్రామ సంఘ అధ్యక్షురాలు స్వాతి ఆధ్వర్యంలో తక్కువ పెట్టుబడితో లభ్యమయ్యే కషాయాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులతో జిల్లేడు ద్రావణం తయారీ చేయించారు. వరి పంట పొట్ట దశలో ఉన్నందున అందరికీ అవసరమయ్యే పొటాష్‌కి బదులుగా జిల్లేడు ద్రావాణం పిచికారీ చేసుకోవాలన్నారు. పొటాష్ లోపాన్ని, చిన్న, చిన్న పోషకాల లోపాలను జిల్లేడు ద్రావణం నివారిస్తుందన్నారు. పలురకాల కషాయాల తయారీ వాటి ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఓఏ తిరుపతి, ఐసీఆర్పీ శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఔషధం



బూరగాం వద్ద ఒకేచోట ఉన్న ఆవులు

- దోమ కాటుతో పాడికి చేటు
- అనారోగ్యం పాలవుతున్న పాడి పశువులు
- అవగాహన పెంచకోకపోతే పశుసంపదకు నష్టం



ప్రహరాజపాలెంలో రేకుల షెడ్డులో ఉన్న ఆవులు

పాతపట్నం:

దోమల కాటుతో పశువులు అనారోగ్యం పాలవుతున్నాయి. ఈ పరిస్థితిని ముందుగానే గుర్తిస్తే మూగజీవాలను ఆరోగ్యవంతంగా చూసుకోవచ్చు. ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు వల్ల పశువులలో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక్కోసారి పశువులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. పాతపట్నం నియోజకవర్గంలో 67,898 పైబిలుకు ఆవులు, గేదెలున్నాయి. ప్రస్తుత సీజన్‌లో పాడిపశువులు గొంతు వ్యాపు, దొమ్ము, గాలి కుంటు తదితర వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. పశువుల్లో వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి సరైన చికిత్స అందివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో పాడి సంపద వివరాలు ఇలా..

మండలం	ఆవులు	గేదెలు
పాతపట్నం	14,133	1,177
మెళియాపుట్టి	17,297	297
కొత్తూరు	19,502	1,032
హిరమండలం	7,599	474
ఎల్.ఎన్.పేట	6,078	308

దోమకాటుతో వచ్చే సమస్యలు..

- పశువులను దోమలు ఎక్కువగా కుట్టడంతో మేత సరిగా తీసుకోవు. ఆకలి మందగించటం జరుగుతుంది. ఈ ప్రభావంతో పాల దిగుబడి తగ్గిపోతుంది.
- పశువు శరీర ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో రోజురోజుకూ బలహీనపడుతుంది.
- దోమలు కుట్టినచోట దురద వచ్చి పుండ్లు పడతాయి
- పశువులకు మేత ప్రాంతం శుభ్రంగా లేకుంటే దోమలు చేరి వాటిని బాధిస్తాయి. మేత కూడా సరిగ్గా తీసుకోలేవు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పశువులను ఉంచే పాకలో దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. షెడ్డుల్లో కట్టేసిన తరువాత దోమ తెరలు వాడటం శ్రేయస్కరం. సాయంత్రం పాడి పశువులను పాకలో కట్టే ముందు వేప ఆకులు, సాంబ్రాణితో పొగ పెట్టాలి. పశువుల శాలల చుట్టూ వ్యర్థాలు, పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పశువులు కట్టేసిన ప్రాంగణాన్ని రోజూ శుభ్రం చేసుకోవడంతోపాటు చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవడం వల్ల దోమల బెడద నుంచి రక్షించుకోవచ్చు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. ఈ నేపథ్యంలో పాడి రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి. పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మేత, దాణాకు అందించే పాత్రలు శుభ్రం చేయాలి. వైద్యుల సలహా మేరకు ఎప్పటికప్పుడు అవసరమైన టీకాలు, మందులు అందించాలి. దోమకాటు వల్ల ప్రమాదకరమైన వ్యాధుల బారినపడే అవకాశాలున్నాయి. పశువులకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

– మంచు కరుణాకరరావు, పశుసంవర్ధకశాఖ ఏడీ, పాతపట్నం

రసాభాసగా ఉపాధి గ్రామసభ

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో గురువారం నిర్వహించిన ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామసభ రసాభాసగా మారింది. ఈ గ్రామంలో 2023 – 24లో జరిగిన సుమారు రూ. 1.21 కోట్లు ఉపాధి నిధుల ఖర్చుకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామంలో గుర్తించిన ఫిర్యాదులు, మస్తర్లలో లోపాలను చదివి వినిపించారు. గ్రామానికి చెందిన కళింగపట్నం దిలీప్.. సోషల్ ఆడిట్ సిబ్బందికి ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నలను చదివారు. ఆ ఫిర్యాదులో అడిగిన ప్రశ్నలలో 2021–22కు సంబంధించిన పనులను ప్రస్తావించడంతో టెక్నికల్ అసిస్టెంట్ రమణ అభ్యంతరం తెలిపారు. అప్పటి పనులకు సంబంధించి అన్ని ఆడిట్లు పూర్తయ్యాయని, ప్రతీసారి ఫిర్యాదుదారుడు దీనిపై లేవనెత్తి అధికారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలియజేశారు. దీనిపై వేతనదారులు, స్థానికులు టెక్నికల్ అసిస్టెంట్‌కు మద్దతుగా నిలవడంతో సభ గందరగోళంగా మారింది. ఈ పంచాయతీలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధిత ఫిర్యాదుదారుడు మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఎప్పుడూ ఏదో ఒక ఫిర్యాదు ఉన్నతాధికారులకు చేస్తుంటారని రమణ తెలిపారు. సభ గందరగోళంగా మారడంతో ఎస్ఐ అనీల్‌కుమార్ తన సిబ్బందితో కలిసి సమస్య తీవ్రతరం కాకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్ఆర్పీ పున్నపునాయుడు, ఏపీఓ నారాయణరావు, సర్పంచ్ సాగిపల్లి దండాసి, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, రావాడ శ్రీనివాసరావు, చల్లా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



సోషల్ ఆడిట్ సిబ్బంది దృష్టికి సమస్య తీసుకెళ్తున్న టెక్నికల్ అసిస్టెంట్ రమణ

ఓటు నమోదు చేసుకోవాలి

హిరమండలం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర అన్నారు. మండలంలోని కోరాడ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బోడ శ్రీను అధ్యక్షతన ప్రాంతీయ సమన్వయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర, జిల్లా కార్యదర్శి, సంఘం సీనియర్ నాయకుడు డి.ప్రకాష్, కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని, పీఎఫ్, ఏపీ జీఎల్ఐ తదితర రుణాలు క్లియర్ చేయాలని, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తగ్గించి బోధనపై దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు, హిరమండలం మండలాలకు చెందిన యూటీఎఫ్ ప్రతినిధులు కె.విజయ్‌కుమార్, పి.జయరాం, ఎ.నారాయణ, బి.రాధాకృష్ణ, బి.నాగరాజు, ఎస్.శంకరావు, పి.చిన్నారావు, ఎం.ప్రసాద్, కొండలరావు, గణపతిరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్ర

అన్నదాత ఆందోళన

సరుబుజ్జిలి/బూర్జ/కొత్తూరు: ఆరుగాలం పండించిన పంటచేతికందివచ్చే దశలో దానా తుఫాన్ ముంచుకురావడంతో రైతులు దిగులు చెందుతున్నారు. సరుబుజ్జిలి మండలంలో ఈ ఏడాది సుమారు 12,234 ఎకరాలు, బూర్జ మండలంలో సుమారు 13 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. కొత్తూరు మండలంలో పత్తి పత్తి పంట పాడయ్యే ప్రమాదం ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరుసు తుఫాన్‌లతో పంటకు కొంత మేర నష్టం జరిగింది. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటే వరి పంటకు నష్టం ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



సరుబుజ్జిలి: పక్వానికి వచ్చిన వరి పంట

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వండి

మెళియాపుట్టి: తనను మళ్లీ గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ అన్నారు. గురువారం ఆయన మండలంలో పర్యటించారు. పెద్దలక్ష్మీపురం, కరజాడ, పెద్దమడి, భరణికోట, మెళియాపుట్టి, చాపర, గొప్పిలి తదితర పాఠశాలలు, సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయ, వార్డెన్, ఏఎన్ఎం తదితర పోస్టులు తక్షణమే భర్తీకి కృషి చేస్తానన్నారు. పలువురు ఉపాధ్యాయులు పాలొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ఆకట్టుకున్న వేషధారణలు



పాతపట్నం: శివుడు, పార్వతీ, తదితర వేషధారణల్లో గ్రామస్తులు

సరుబుజ్జిలి: గౌరీపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తెలికిపెంట, పెద్దసవలాపురం, సరుబుజ్జిలి, కొత్తకోట గ్రామాల్లో గురువారం పలురకాల వేషధారణలతో గ్రామస్తులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు గౌరీపరమేశ్వరులకు పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ పూజలు దీపావళి వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన గౌరీపౌర్ణమి వేడుకలు

పాతపట్నం: మండలంలోని తిడ్డిమి గ్రామంలో గౌరీపౌర్ణమి వేడుకలు గురువారంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా గ్రామస్తులు పగటి వేషధారణలు అందర్నీ ఆకట్టుకున్నాయి.



సరుబుజ్జిలి: పెద్దసవలాపురంలో పలు రకాల వేషధారణల్లో గ్రామస్తులు

సేంద్రియ పంటలతో ఆరోగ్యం

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాలలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో కూరగాయలు సాగు చేయనున్నట్లు ప్రకృతి వ్యవసాయ డీపీఎం ధనుంజయరావు తెలిపారు. గురవారం మండలంలోని అలుదు-2 అంగన్వాడీ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన పోషణ వాటికను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలలో పోషణ వాటికలు ఏర్పాటు చేసి, సేంద్రియ పద్ధతుల ద్వారా కూరగాయలు సాగు చేయనున్నామన్నారు. దీనికి సంబంధించిన విత్తనాలు, ఘన, ద్రవ జీవామృతాల తయారీ విధానం గూర్చి పకృతి సిబ్బందికి శిక్షణిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎఫ్ఏ గోవిందరెడ్డి ఉన్నారు.

అందుబాటులో కొబ్బరి మొక్కలు



పరిశోధనా స్థానంలో ఉన్న కొబ్బరి మొక్కలు

బూర్జ: మండలంలోని పెద్దపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధనా స్థానంలో కొబ్బరి మొక్కలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ పి.అశోక్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. దేశవాలీ రకమైన ఈస్ట్‌కోస్ట్ టాల్ కొబ్బరి మొక్క ధర రూ.100 నిర్ణయించడమైందన్నారు. కొబ్బరి మొక్కలు కావల్సిన రైతులు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పరిశోధనా స్థానంలో సంప్రదించాలన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కొత్తూరు: మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న 8వ తరగతి విద్యార్థులకు గురువారం హెచ్ఎం డీఎల్ నరసింహం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో సమాజ్ పరివర్తన్ కార్యదర్శి నరేష్ అధ్వర్యంలో మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి కృషి చేయాలి

ఎల్.ఎన్.పేట: ప్రపంచ శాంతి కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్ పర్సన్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.కె.మిశ్రో పిలుపునిచ్చారు. గురువారం ఐక్యరాజ్య సమితి, ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా లక్ష్మీనర్సుపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి ఆవిర్భావం, ఆశయం, శాంతి వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశంలోనూ, మన ఊరిలోనూ శాంతి లేకుంటే కలిగే అనర్థాలు తెలియజేశారు. కేజీబీవీ ఎస్ఓ ఎం.వి.అంబిక, ఉపాధ్యాయలు టి.ఉపేంద్ర, కేజీబీవీ సిబ్బంది సాయిబాల, రాజేశ్వరి, రేవతి పాల్గొన్నారు.


బాలల రక్షణ కమిటీ ఏర్పాటు

పాతపట్నం: బాలల హక్కుల పరిరక్షణ కోసం మండల కమిటీని ఏర్పాటు చేశామని ఎంపీడీఓ చంద్రకుమారి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దోర సావిత్రమ్మ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ విమలారాణి మాట్లాడుతూ బాలల హక్కులపై గ్రామాల్లో అవగాహన కార్యాక్రమాలు నిర్వహించాలన్నారు. మండల స్థాయి అధికారులు సహకరించాలన్నారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఏపీఓ సురేష్, డాక్టర్ శివకుమార్, ఏఎస్ఐ కృష్ణారావు, ఏఓ తిరుపతిపట్నాయక్, ఈఓపీఆర్డీ వెంకటరమణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పొంచి ఉన్న ప్రమాదం



సరుబుజ్జిలి మండలంలోని పాలవలస–పెదవెంకటాపురం పంట పొలాల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం పూర్తిగా వాలిపోయింది. మరికొన్ని స్తంభాలు కూడా వరుసగా ఒరిగిపోయాయి. విద్యుత్ వైర్లు పంట పొలాలను తాకుతూ వెళుతున్నాయి. మరికొద్ది రోజుల్లో రైతులు వరి పంట కోతలు ప్రారంభించనున్నారు. వరి చేనుపై తీగెలు వేలాడుతూ ఉండడం వల్ల రైతులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

భయపెడుతున్నాయ్..



ఈ చిత్రం మెళియాపుట్టి మూడు రోడ్ల కూడలి వద్ద గుంపుగా సంచరిస్తున్న కుక్కలు. మండలంలో కుక్కల బెడద రోజురోజుకీ తీవ్రతరమవుతోంది. మెళియాపుట్టి, చాపర, కొసమాల, పట్టుపురం ఇతర ముఖ్య రహదారులు, కూడళ్లలో నిత్యం సంచరిస్తున్నాయి. పాఠశాలలు ముగిశాక విద్యార్థులు ఇళ్లకు చేరే సమయంలో దాడులు చేస్తున్నాయి. నియంత్రించడానికి అధికార యంత్రాంగం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

– మెళియాపుట్టి

గోతులమయం



పాతపట్నం–టెక్కలి రహదారిలో గల ప్రహరాజపాలెం సమీపంలో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో ఒక్కడో ఒకచోట తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పాతపట్నం నుంచి తెంబూరు వరకు ట్రాక్టర్ల యాజమానులు గోతుల్లో మట్టి వేసినప్పటికీ మళ్లీ అధ్వానంగా తయారవుతోంది. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని స్థానికులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

– పాతపట్నం

పేరుకుపోయిన గుర్రపుడెక్క



ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న తురకవాని చెరువు గుర్రపుడెక్కతో నిండింది. చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. మదుముల వద్ద గుర్రపుడెక్క అడ్డంగా ఉండటంతో సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉంటుంది. చెరువులో చేపల పెంపకానికి ఇబ్బందిగా ఉందని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి గుర్రపుడెక్కను తొలగించాలని కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

తుఫాన్‌పై అప్రమత్తం



జలుమూరు: రైతులకు సూచనలిస్తున్న తహసీల్దార్ రామారావు



మెళియాపుట్టి: రట్టిణి గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

జలుమూరు: దానా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. గుగ్గిలి, గుండవలస గ్రామాల్లో గురువారం పర్యటించి రైతులతో మాట్లాడారు. పంట పొలాలో డ్రోన్ ఎగురవేసి తుఫాన్‌పై రైతులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నదితీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పలుశాఖల అధికారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నదీతీర ప్రాంతాల్లో అధికారుల పర్యటన..

మెళియాపుట్టి: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి లింగాల మధుబాబు, ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా, తహసీల్దార్ పాపారావు అన్నారు. మహేంద్రతనయ నదీతీర ప్రాంతంలో ఉన్న రట్టిణి గ్రామ ప్రజలకు తుఫాన్‌పై అప్రమత్తం చేశారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకూ ఎవరూ నదివైపు వెళ్లొద్దని సూచించారు. తుఫాన్ సమయంలో ఎవరూ బయటకురావొద్దని సూచించారు.

రోస్టర్ విధానం పాటించాలి

పొందూరు: కేజీబీవీ నియామకాలలో రోస్టర్ విధానం పాటించాలని డీటీఎఫ్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సర్వశిక్ష అభియాన్ అధికారులు ఈ నెల 23న విడుదల చేసిన సీఆర్టీ, పీజీటీ, పార్ట్ టైమ్ టీచర్స్, తదితర పోస్టుల నియామక ప్రొవిజనల్ మెరిట్ జాబితాలో ఏపీ స్టేట్ సబార్డినేట్ రూల్స్ 22 జీఓ నంబర్ 77 మేరకు మెరిట్ కమ్ రోస్టర్ విధానం పాటించకపోవడం చాలా విచారకరమన్నారు. దీనివల్ల రిజర్వ్‌డ్ కేటగిరి అభ్యర్థులు నష్టపోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వశిక్షఅభియాన్, జిల్లా అధికారులు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నోటిఫికేషన్ మేరకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తరువాత ప్రొవిజనల్ లిస్టులను మెరిట్ కమ్ రోస్టర్ పద్ధతిలో (1:3) పెట్టకుండా 1:20 పెట్టడం సరికాదన్నారు. ఈ జాబితాలో తప్పులను సవరించాలని అధికారులను డిమాండ్ చేశారు.